

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**యే రాత్ భీగీ భీగీ, యే మస్త్ ఫిజాయేన్**

**ఉఠా ధీరే ధీరే వో చాంద్ ప్యారా ప్యారా**

ఇది నిద్రరాని రాత్రులలో పాడుకునే పాటనే అయినా ఈ పాట పాడుకోవాలంటే ప్రత్యేక సందర్భం అవసరం, లేదా, సున్నితమైన హృదయం, ప్రేమకోసం తపించే హృదయం అవసరం. అంటే, ఇది యుగళగీతమైనా ప్రేమ పిపాసులు రాత్రంతా మేల్కొని కలవరిస్తూ పలవరిస్తూ పాడుకోగల పాటన్నమాట. ఇది సినిమాలో యుగళగీతమే అయినా నిజానికి ఒంటరి హృదయ వేదన అనవచ్చు. ప్రేమకోసం పలకరించే ప్రేమ పిపాసి హృదయపు స్పందనల సవ్వడి అనవచ్చు. ఎందుకంటే యుగళగీతం పాడే ఇద్దరికీ ప్రేమ తపన ఉంది కానీ ప్రేమానుభవం లేదు. ఇలాంటి సందర్భాలలోనే గేయరచయిత ప్రతిభ ప్రస్ఫుటమవుతుంది.

'చోరీ చోరీ' సినిమాలోది ఈ పాట. రాజ్‌కపూర్, నర్గీస్‌లు నాయకా నాయికలు. వారి నిజజీవితంలోని రొమాన్స్ ప్రభావం తెరపై పాత్రలను ప్రేక్షకుడు అర్థం చేసుకునే విధానంపై పడుతుంది. దాంతో తెరపై పాత్రలు సినిమా పరిధిని దాటి ప్రేక్షకుడి మనస్సును స్పందింపచేస్తారు. సినిమాలో నాయిక ఇష్టంలేని పెళ్లినుంచి తప్పించుకునేందుకు ఇల్లు వదిలి పారిపోతుంది. ఆమెని పట్టించిన వారికి 1.25 లక్షల బహుమతి ఇస్తానని ప్రకటిస్తాడు. ఇది తెలిసిన ఓ జర్నలిస్టు ఆమెతో స్నేహం చేస్తాడు. కానీ ఆమె ప్రేమలో పడుతూంటాడు. యువతీ యువకులు సన్నిహితంగా ఉంటే వారిలో వారి ప్రమేయం లేకుండా జనించే సున్నితమైన ఆకర్షణ ఆరంభదశలో ఉంటుంది. ఆ సందర్భంలో వచ్చే పాట అన్నమాట ఇది. అనుకోకుండా ఓ రాత్రి వారిద్దరూ ఓ చోట ఉండాల్సి వస్తుంది. ఆ కాలం కాబట్టి ఒకే గదిలో ఉండలేరు. ఆమె గదిలో ఉంటుంది. ఇతడు బయట ఓ ఉయ్యాలలా కట్టుకుని పడుకుంటాడు. కానీ నిద్రరాదు. ఎదురుగా మనసు ఆకర్షితమవుతున్న యవ్వనవతి. మనసులో వయసుకు తగ్గ కోరికల అల్లరి. కానీ వారు సంస్కారవంతులు, అంటే, ఒకరినొకరు గౌరవించుకునేవారు. వయసు చేసే అల్లరిని అదుపులో పెట్టుకోవాలన్న జ్ఞానం కలవారు. వయసు ప్రచోదనలను నియంత్రించాలన్న పరిజ్ఞానం కలవారు. కాబట్టి నర్మగర్భంగా, ప్రతీకాత్మకంగా, సున్నితంగా, అత్యంత తాత్వికంగా వయసు అల్లరి స్వరూపాన్ని అర్థం చేసుకుంటూ, మనసులో కలిగే స్పందనల స్వరూపాన్ని విశ్లేషించుకుంటూ, జగతి రీతిని వితర్కించుకుంటూ తమ భావాలను గీతం రూపంలో వ్యక్త పరుస్తారు.

'బిన్ బాదల్ బర్సాత్' అనే సినిమాలో బిస్వజిత్, ఆశాపరేఖ్‌లకు ఇలాంటి పరిస్థితి వస్తుంది. ఇద్దరూ పక్క పక్క గదుల్లో ఉంటారు. ఇద్దరికీ నిద్రరాదు. ఆ సమయంలో హేమంత్ కుమార్ మృదువైన గొంతుకతో మధురంగా పాటను అందుకుంటాడు బిస్వజిత్. పాటను రాసింది షకీల్ బదాయుని. సంగీతం స్వయంగా హేమంత్ కుమార్. అత్యంత రొమాంటిక్‌గా, అతి మధురంగా, మృదువుగా ఉంటుంది పాట.

**జబ్ జాగ్ ఉఠే అర్మాన్, తొ కైసే నీంద్ ఆయే.**

**హో ఘర్ మె హసీన్ మెహమాన్, తో కైసే నీంద్ ఆయే**

ఇంట్లో అందమైన అతిథి ఉంది. మనసులో కోరికలు నిద్రలేచాయి. ఇక నిద్ర ఎలా వస్తుంది?' అని మనోహరంగా అడుగుతున్నాడు నాయకుడు. చక్కని పాట. మధువు కోసం మధుపాన చిత్తుడు ఎలా తాపత్రయపడతాడో, అలా నిప్పుల్లో ప్రాణం ఉన్నట్టున్నప్పుడు నిద్ర ఎలా వస్తుందని అడుగుతాడు. రొమాన్స్ ఉట్టి పడుతూంటుంది. హేమంత్‌కుమార్ స్వరం. పాట పాటకు మైమరచిపోతాం.

'జంగల్ మే మంగల్' సినిమాలో నాయిక, నాయకుడు తమ స్నేహితులతో అడవికి వెళ్తారు. అక్కడ రాత్రి నాయిక తన గదిలో ఉంటుంది నాయకుడికి నిద్రరాదు. కిషోర్ కుమార్ గొంతుకతో, శంకర్ జైకిష సంగీతంలో హస్రత్, నీరజ్‌లు రాసిన పాటను అర్ధరాత్రి ఆమె కిటికీ క్రిందకు వెళ్లి పాడతాడు హీరో.

**తుం కిత్‌ని ఖూబ్ సూరత్‌హో**

**యే మేరె దిల్‌సె పూఛో, ఇన్ ధడ్ కనోంసే పూఛో తుం**

**క్యా దిల్ హై తుం పె దీవానా!**

నువ్వు ఎంత అందగత్తెవో నా హృదయాన్ని అడుగు. నా హృదయం నిన్ను పిచ్చిగా ఎందుకని ప్రేమిస్తోందో నా హృదయపు లయని అడుగు అంటున్నాడు హీరో.

'అమన్' సినిమాలో జపాన్ వెళ్లి నాయిక ప్రేమలో పడతాడు హీరో రాజేంద్రకుమార్. పక్కగదిలో నాయిక సైరాబాను ఉంటుంది. నాయకుడికి నిద్రరాదు. శైలేంద్ర పదాల భావాలకు రఫీ ప్రాణం పోయగా శంకర్ జై కిషన్ సంగీత దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ పాటను పాడతాడు రాజేంద్రకుమార్.

**ఆజ్ కీ రాత్, యె కైసీ రాత్, కె హం కో నీంద్ నహీ ఆతీ**

**మెరీజాన్ ఆవో, బైఠో పాస్, కె హం కో నంద్ నహీ ఆతీ...**

ఈ రాత్రి ఎలాంటిదో కానీ నాకు నిద్రరావటంలేదు. నా ప్రాణమా, నా దగ్గరకు వచ్చి కూర్చో. నాకు నిద్రరావటంలేదు అంటాడు నాయకుడు. ఇలా నాయిక పక్కన ఉండగా సంస్కారపు సంకెళ్ల పరిధిలో ఒదుగుతూ మనసులో మాటను చెప్పాలని నాయకుడు, నాయిక తపన పడే పాటలు ఉన్నాయి. అన్నీ మధురమైనవి. మరుపురానివి.

కానీ వాటన్నిటికీ భిన్నంగా నిలుస్తుంది 'యే రాత్ భీగీ భీగీ' పాట,  కేవలం పాటలో పదాలు స్ఫురింపచేసే భావన బలం వల్ల.

యే రాత్ భీగీ భీ పాటను రాసింది శైలెంద్ర. సంగీతం రూపొందించింది శంకర్‌జైకిషన్. శంకర్‌జైకిషన్, శైలేంద్రల అనుబంధం అద్భుతమైనది. శంకర్‌జైకిషన్ లు వీలయినంత సరళమైన బాణీని, అత్యంత ఆకర్షణీయంగా రూపొందిస్తారు. వారి పల్లవులు చాలా చిన్నవిగా ఉంటాయి.

వారు ముందుగా బాణీని సృజించటంతో చిన్న చిన్న పదాలను బాణీలో ఇముడుస్తూ భావాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. గేయరచయిత 'కైఫీ ఆజ్మీ' లాంటి కవులు 'గొయ్యి తవ్వి, శవాన్ని గోతి పరిమాణంలో ఇమిడ్చినట్టుంటుంది. బాణీకి పాట రాయడం అని ఈసడించారు. కానీ మంచినీళ్లు తాగినంత సులభంగా బాణీకి పదాలను కుదర్చటం శైలేంద్రకు వెన్నతో పెట్టిన విద్య. మంచినీళ్లయినా అప్పుడప్పుడు గొంతుకు అడ్డుపడతాయి. కానీ శైలేంద్ర పదాలు ఎప్పుడూ స్వేచ్ఛగా ప్రవహించే మంచినీటి ప్రవాహంలా బాణీ అంచులలో ఒదుగుతూ పరుగులిడతాయి. అయితే, శైలేంద్ర ఇతర సంగీత దర్శకులకూ, శంకర్ జైకిషన్ గీతాలకూ పాటలు రాసే పద్ధతిలో తేడా ఉంటుంది. ఇతర సంగీత దర్శకులకు పాటలు శైలేంద్ర సందర్భ పరిధిలో ఒదిగి రాశాడు. అద్భుతంగా రాశాడు. కానీ శంకర్‌జైకిషన్‌లకు పాట రాసేటప్పుడు మాత్రం సందర్భ పరిధిలో ఒదుగుతూ, విశ్వ జనీనమైన భావాలు అత్యంత సరళంగా పొదుగుతూ పాట స్థాయిని, లోతును బరువును మరింతగా పెంచే రీతిలో పాటను రచించాడు శైలేంద్ర. దాంతో ఒకోసారి అతి తేలికగా అనిపించే బాణీలు కూడా అత్యద్భుతమైన పాటలుగా ఎదిగి శ్రోతల మనస్సులలో స్థిరపడిపోతాయి. అందుకే శైలేంద్ర మరణం తరువాత శంకర్‌జైకిషన్‌లు మరే ఇతర గేయ రచయితతో  సరిగ్గా పని చేయలేకపోయారు. వాటి పాటల విలువ దిగజారటానికి నాందీ ప్రస్తావన జరిగింది.

'భీగీరాత్ ' అన్నది పలు అర్థాలను ఇముడ్చుకున్న పదం. సాధారణంగా తడి రాత్రి, చలి అధికంగా ఉన్న రాత్రి అన్న అర్థం వస్తుంది. రాత్రిపూట చలి అధికంగా ఉండే భాగాన్ని 'భీగీరాత్' అంటారు. వర్షంలో తడిసిన రాత్రిని 'భీగీరాత్ ' అంటారు. 'మిస్టీ  నైట్ ' కూడా 'భీగీరాత్ ' క్రిందకే వస్తుంది.  సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలి. వర్షంలో తడుస్తూ నాయికా నాయకులు 'భీగీ భీగీ రాతోంమే' అంటే, పొగమంచుతో తడిసిన, నిండిన రాత్రిగా అర్థం చేసుకోకూడదు.

'చోరీ చోరీ 'లో ఈ పాట వెనుక ఓ కథ ఉంది. సాధారణంగా రాజ్‌కపూర్ పాట అనగానే ముకేష్ గొంతు గుర్తుకు వస్తుంది. కానీ ఈ పాట పాడింది మన్నాడే. ముకేష్ సినిమా హీరో అయిపోవాలనుకున్నాడు. దాంతో హీరోలు ముకేష్ తమకు పాడటానికి ఇష్టపడలేదు. దాంతో రాజ్‌కపూర్ కు ముకేష్‌కు ప్రత్యామ్నాయ స్వరం అవసరమయింది. శంకర్‌జైకిషన్‌లకు మన్నాడే అంటే ఇష్టం. మన్నాడే శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతుడు. స్వరంలో పలు భావాలు పలికించగలడు. పాట బాణీ ఎంత క్లిష్టమైనదైనా పాడగలడు. ముకేష్‌కు శాస్త్రీయ సంగీతం రాదు. స్వరం ఒకే భావం

పలుకుతుంది. బాణీ క్లిష్టంగా ఉండకూడదు. పాటలో అలంకారాలను వాడలేదు. అందుకని ముకేష్ బలహీనతలను దృష్టిలో ఉంచుకుని బాణీని రూపొందించాల్సి ఉంటుంది. మన్నాడేతో అలాంటి సమస్యలుండవు. పైగా ఆవారాలో, శ్రీ 420లోనూ గతంలో శంకర్ జైకిషన్ రాజ్‌కపూర్ కోసం మన్నాడే స్వరాన్ని వాడారు. దాంతో, ముకేష్ వద్దనుకునేసరికి మన్నాడేను వారు వాడారు. బాణీని స్వేచ్ఛగా రూపొందించారు.

సినీ పరిశ్రమ పైకి కనిపించినంత ఆకర్షణీయమైనది కాదు. ఇక్కడ ఒక కళాకారుడిపై ఓ ముద్ర పడిందంటే ఆ ముద్రను చెరిపివేసుకోవటం దాదాపుగా అసంభవం. మన్నాడే ఆరంభంలో తాత్వికమైన నేపథ్యగీతాలు పాడాడు. దాంతో అతడిపై ఆ ముద్ర పడిపోయింది. రొమాంటిక్ పాటలకు, యుగళగీతాలకు పనికిరాడన్న భావన స్థిరపడింది. శ్రీ 420లో 'ప్యార్ హువా ఇక్ రార్ హువా ' పాటతో శంకర్‌జైకిషన్ ఆ ఇమేజ్‌కి గండి కొట్టారు. కానీ ఏ నాయకుడికీ సరిపోని మన్నాడే స్వరంతో రొమాంటిక్ పాటలు పాడించేందుకు ఇతర సంగీత దర్శకులు అంతగా ముందుకు రాలేదు. దాంతో అవకాశం చిక్కగానే శంకర్‌జైకిషన్ 'చోరీ చోరీ 'లో 'యే రాత్ భీగీ భీగీ ' పాటకోసం మన్నాడేను ఎంచుకున్నారు. కానీ నిర్మాతకు మన్నాడే నచ్చలేదు. ముకేష్ కావాలన్నాడు. రికార్డింగ్ స్టూడియోలో మన్నాడే ఎదురుగానే మన్నాడేని అవమానించి ముకేష్‌ని పిలవమని పట్టిబట్టాడు. మన్నాడే పాడిన పాట విన్న తరువాత నచ్చకపోతే ముకేష్‌ని పిలిచేట్టు నిర్మాతను ఒప్పించి పాటను రికార్డు చేశారు. దాని తరువాత ఇదే సినిమాలో మరో మరుపురాని యుగళగీతం 'ఆజా సనం మధుర్ చాందినీమె హం' కూడా మన్నాడేతోనే రికార్డు చేశారు. కానీ, మన్నాడే వంటి ప్రతిభావంతుడికి మరుపురాని చేదు అనుభవం ఇది. తన జీవిత చరిత్రలో ఈ సంఘటనను రాసుకున్నాడు మన్నాడే. ఇలాంటి క్రూరమైంది సినీ పరిశ్రమ. విజయం ఎంత తీయనిదయినా, అవమానపు చేదు అనుభవం తాలుకు గాయాన్ని మాత్రం మాన్పలేదు. ఆ మచ్చను కాలం కూడా చెరిపి వేయలేదు. కానీ పాట వింటూంటే ఒక చేదు అనుభవం తరువాత బాధతో పాడుతున్న ఆలోచన రానే రాదు.

'ఇది చల్లని రేయి. అందంతో పరవళ్లు తొక్కుతున్న గాలులు వీస్తున్నాయి. అందమైన చంద్రుడు మెల్లిగా ఆకాశంలోకి వస్తున్నాడు' ఇది పాట ఆరంభం. పాటలో శైలేంద్ర ఎక్కడా నాయకుడి మనసులో వయసు అల్లరి గురించి చెప్పలేదు. ప్రేమకోసం యువహృదయం పడుతున్న తపనను, ఆరాటాన్ని ప్రదర్శించలేదు. కేవలం వాతావరణాన్ని వర్ణిస్తున్నాడు. రొమాంటిక్ వాతావరణాన్ని వర్ణిస్తున్నాడు. ఇక్కడే శైలేంద్ర రచనలో చమత్కారం గమనించాల్సి ఉంటుంది.

వాతావరణం ప్రభావం మనస్సుపై ఉంటుంది. ఆలోచనలపై ఉంటుంది. చలిగా ఉన్నప్పుడు వెచ్చగా దుప్పటి కప్పుకుని పడుకోవాలనిపిస్తుంది. వర్షం పడుతున్నప్పుడు వేడివేడి మిర్చిలు తింటూ, వేడి వేడి కాఫీ తాగాలనిపిస్తుంది. ఇలా వాతావరణం ప్రభావం వ్యక్తి మనస్సుపై, మనస్సులో కలిగే కోరికలపై ఉంటుంది. ఇక్కడ నాయకుడు యువకుడు. మనసు మెచ్చిన యువతి దగ్గరలో ఉంది. వాతావరణం చల్లగా మంచుతో తడిసి ఉంది. గాలి వీస్తోంది వేగంగా. చంద్రుడు ఉదయిస్తున్నాడు. రొమాంటిక్ వాతావరణం. రొమాంటిక్ భావనలు జాగృతం కావటంలో ఆశ్చర్యంలేదు.

పాటను శంకర్‌జైకిషన్ కీరవాణి రాగంలో రుపొందించారు. కీరవాణి రాగం రాత్రిపూట పాడే రాగం. ముఖ్యంగా మధ్యరాత్రి అత్యంత ప్రభావం చూపించే రాగం. కాబట్టి కీరవాణి రాగంలో పాట రూపొందటం సముచితం, ఔచిత్యం. పాట ఆరంభంలో గిటార్ తంత్రులు పలికే స్వరాలకు, సుడిగాలిలా వయొలిన్ నాదాలు తోడై పర్వతంపై నుండి దూకేందుకు పరవళ్లు తొక్కే నదిలా మనసును ఉద్విగ్నభరితం చేస్తాయి. గుండె లయను వేగవంతం చేస్తాయి. పైనుండి నీరు క్రిందకు ఎంత స్వాభావికంగా జాలువారుతుందో, అంత స్వాభావికంగా మన్నాడే స్వరంలోకి జాలువారుతుంది. మన్నాడే 'యే రాత్ భీగీ భీగీ' అంటూ పాట అందుకుంటాడు.

సినిమాలో పాట ఆరంభం అయ్యేందుకు ముందు సంగీతం వస్తున్నప్పుడు రాజ్‌కపూర్ పాత్ర గదిలోంచి తన బట్టలు తీసుకుని బయటకు వస్తూంటుంది. నాయిక నర్గీస్ వదనంపై ఓ రకమైన విషాదం, ఓ రకమైన నిర్వేదం కలగలసిన భావనలుంటాయి. ఒక చిన్న నవ్వుకూడా ఉంటుంది పెదిమలపై. యువ పురుష హృదయాల ఆశ నిరాశలు, ఆవేశాలపట్ల అవగాహన ప్రతిఫలించే నవ్వు అది. యువతి హృదయంలో పైకి ప్రదర్శించలేని స్పందనల స్వరూపం ఆ నవ్వు. మన్నాడే పాట అందుకుంటాడు.

మన్నాడే పాడుతున్నప్పుడే లత స్వరం ఆలాపన అందుకుంటుంది. ఇక్కడ సంగీత దర్శకులు, సినిమా దర్శకుల నడుమ ఉన్న అవగాహనను గమనించాల్సి ఉంటుంది. పడుకునేందుకు బట్టలు తీసుకుని వెళ్లిన నాయకుడు బట్టలు పారేసి, ఓ చెట్టు ఆకు పీకి (నిరాశ, విసుగు) వెన్నెల వైపు చూస్తూ పాట పాడతాడు. అతని పల్లవి పూర్తికాకముందే నాయిక పాట అందుకుంటుంది.

అసందర్భమైనా కన్యాదాన్ సినిమాలో హస్రత్ జైపురి రాసిన పాటలో పంక్తులు గుర్తుకు వస్తాయి 'మెరెసాథ్ తుంభి గాతే, తొ కుఛ్ ఔర్ బాత్ హోతీ', నాతో నువ్వు కలిసి పాడితే అసలు ఆ మజానే వేరు అన్న అర్థం వస్తుంది. ఈ పాట కనుక యుగళగీతం కాకపోతే ఇంతగా మరుపురాని పాట అయి ఉండేది కాదేమో! లత ఆలాపనతో పాట స్వరూపం మారిపోతుంది. నాయకుడిలో కలుగుతున్న సంచలనం నాయకలోనూ కలుగుతోంది. ప్రేమలో పురుషుడు ఒక అడుగు ముందుకు వేస్తే స్త్రీ పదడుగులు ముందుకు వస్తుందంటారు. ఇక లత ఆలాపన ఆరంభించగానే కెమేరా ఆమె వైపు తిరుగుతుంది. ఒక పెయింటింగ్ లాంటి దృశ్యం అది. నాయిక సిగ్గుతో అణిగిపోతూ కూడా రొమాంటిక్ భావాల సంచలనం ప్రతిఫలిస్తూ మనసు లోలోతుల్లోంచి గానం చేస్తున్నట్టుంటుంది. ఈ ఒక్క ఆలాపనలో లత పలికించిన భావాలు నర్గీస్ ముఖంలో ప్రతిఫలించటం గమనిస్తే చాలు ఆనాటి కళాకారులు ఎంతగా పాత్రలలో లీనమయ్యేవారో తెలుస్తుంది. వారికి సినిమా 'జీవితం' అని అర్థమవుతుంది.

**క్యా అగ్ సీ లగాకే గుం సుం హై చాంద్‌నీ**

**సోనే భీ నహీదేతా మౌసం కా యే ఇషారా.**

విషయం తేట తెల్లం చేసింది నాయిక. నాయకుడు ఒక అడుగు వేశాడు. వాతావరణం రొమాంటిక్‌గా ఉందని ప్రతీకాత్మకంగా చెప్తాడు. మన్సులో అగ్ని రగిల్చి ఏమీ తెలియనట్టు మౌనంగా ఉన్నాడు చంద్రుడు. ఋతువు, వాతావరణం చేస్తున్న సౌంజ్ఞలు నిద్రపోనీయటంలేదు అంటోంది నాయిక. అద్భుతమైన పద ప్రయోగం. సున్నితమైన భావనలను అతి గొప్పగా వ్యక్తపరచటం ఇది. ఇక్కడ సౌంజ్ఞలు చేస్తున్నది బాహ్యంగా కనిపిస్తున్న వాతావరణమా?అంతః ప్రకృతినా?

వాతావరణం ఆహ్లాదంగా ఉంది. యువతీ యువకుల హృదయాలలో గిలిగింతలు కలగటం సహజం. ఆ గిలిగింతల స్వరూపాన్ని అర్థం చేసుకోవటం, వ్యక్తీకరించటం వ్యక్తి స్వభావాన్ని, సంస్కారాన్ని బట్టి ఉంటుంది. ఇక్కడ నాయిక పాట వినగానే ఆమె స్వభావం అర్థమైపోతుంది. ఆమె మాములు యువతి కాదు. ఆమెది గంభీరమైన స్వభావం. విషయాలను తేలికగా తీసుకోదు. లోతుగా ఆలోచిస్తూంది అని స్పష్టమౌతుంది. 'మాసం కా ఇషారా'ను అర్థం చేసుకోవటమే కాదు ఆ 'ఇషారా 'తనలో కలిగిస్తున్న స్పందనల స్వరూపాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తోందన్న భావన కలిగిస్తుంది. 'నర్గీస్ పెదిమలు నవ్వుతున్నా కళ్లు విషాదంగా ఆలోచిస్తున్నట్టుంటాయి' అంటాడు సాదత్ హసన్ మాంటో. ఆమెను 'brooding beauty' అంటారు. అందుకే నర్గీస్ కోసం శైలేంద్ర రాసిన పాటలలో అనేక లోతైన ఆలోచనలను ప్రదర్శించాడు.

'ప్యార్ హువా' లాంటి రొమాంటిక్ పాటలో కూడా 'మైన రహూంగీ తుం న రహోగే, ఫిర్ భీ రహేగి నిషానియా' అనిపించాడు. ఈ పాటలో కూడా ఆరంభంలోనే ఆమె ఆలోచన సరళిని ప్రదర్శించాడు. వెన్నెల యువ హృదయాలలో అగ్ని రగల్చటం ప్రాకృతికం. వాతావరణం నిద్రపోనివ్వకపోవటం ఆమెలో కలిగే సంచలన ఫలితం. పైగా 'మౌసం కా యే ఇషారా' అని నవ్వటం రాజ్‌కపూర్ పాత్రపట్ల ఆమెలో కలుగుతున్న ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది.

**ఇఠ్లాతి హవా, నీలం స గగన్**
**కలియోం పే యే బేహోషీ కీ నమీ**
**ఇ సే మెఖిక్యూ బేచైన్ హై దిల్**
**జీవన్ మె న జానే క్యా హై కమీ.**

సంస్కారవంతమైన యువ హృదయాల సందిగ్ధాన్ని వర్ణించాడు శైలేంద్ర. 'ఇఠ్‌లానా' అంటే వంకర్లు పోవటం, నకరాలు చేయటం. గాలి నకరాలు చేస్తోందట. ఆకాశం నీలమణిలా ఉందట. మొగ్గలపై 'బేహోషీకి నమీ' 'బేహోషీ' అంటే మూర్ఛపోవటం. అతడి మొగ్గలపై ఉందట. అత్యద్భుతమైన వాతావరణంలో కూడా అతని హృదయంలో శాంతిలేదు. అశాంతికి కారణం తెలియటంలేదు. 'ప్రేమ రాహిత్య భావన ' ఒకరకమైన అశాంతిని కలిగిస్తే, తన ప్రేమ పాత్రులెవరో తెలియని యువహృదయం ఇంకోరకమైన అశాంతిని కలిగిస్తుంది. తన ప్రేమ ఎవరో తెలిసి ఇంకా నిర్ధారించుకోలేని

యువహృదయం అశాంతి ఇక్కడ వ్యక్తమౌతోంది. అశాంతికి కారణం నాయకుడికి తెలియదు. తన ప్రేమ భావన స్వరూపం అతడికి తెలియదు. ప్రేక్షకులకు తెలుసు నాయకుడు తన సందిగ్ధాన్ని వ్యక్త పరిచాడు. ఇపుడు నాయిక వంతు.

**జోదిన్‌కి ఉజాలేమె నమిలా, దిల్ ఢూంఢే ఇసి సప్నేకో**

**ఇస్ రాత్‌కె జగ్ మగ్ మే డూబీ, మై ఢూంఢ్ రహీ హూ అప్నేవో**

ఇది ఈ పాట స్వరూపాన్ని సంపూర్ణంగా మార్చివేసే చరణం. ఈ చరణాలు అర్థం తెలుసుకున్న తరువాత పాట చిత్రీకరణ చూస్తే పాట మరింత సన్నిహితంగా అనిపిస్తుంది. మన్నాడే చరణం తరువాత ఇంటర్ల్యూడ్ సంగీతం ఆరంభమయ్యేసరికి నర్గీస్ వదనం క్లోజ్ ప్ లో తెరపై కనిపిస్తుంది. ఆమె చూపులో ఒక ఆలోచన, కాస్త ఆనందం, కాస్త పరిశీలన కనిపిస్తుంది. ఆమె చూపులో ఒక వ్యక్తిని ఆనందంతో, అనురాగంతో అంచనా వేయటం కనిపిస్తుంది. వెంటనే దృశ్యం నిద్రపోవటానికి సర్దుతున్న రాజ్‌కపూర్‌ను చూపిస్తుంది. రాజ్‌కపూర్ పాత్రకు నర్గీస్ చూపుల విషయం తెలియదు. అతని లోకంలో అతను ఉంటాడు. ఆ చూపులోని భావం తెలియాలంటే శైలేంద్ర నర్గీస్ కోసం రాసిన చరణం అర్థాన్ని తెలుసుకోవాలి. 'ఉదయపు వెలుతురులో లభించని స్వప్నాన్ని హృదయం వెతుకుతోంది. ఈ రాత్రి ధగధగలలో మునిగి నన్ను నేను వెతుక్కుంటున్నాను' అని పాడుతోంది నాయిక. ఈ రెండు పాదాలలో శైలేంద్ర ఇమిడ్చిన భావం చాలు జీవితాంతం కాదు జన్మజన్మలకు శైలేంద్ర గేయరచన పద్ధతికి దాసోహం అవటానికి.

ఉదయపు వెలుతురులో వెతికినా లభించనటువంటి స్వప్నాన్ని వెతుకుతోంది ఆమె. 'స్వప్నం' నిద్రలో వస్తుంది. నిద్ర సాధారణంగా రాత్రిపూట పని. పగలు వచ్చే స్వప్నాలు పగటి కలలు. నిజం కానివి. అంటే రాత్రి కన్న కలలు సాకారం అవటం కోసం మనం ఉదయం వెలుగులో కష్టపడతాం. కానీ కలలు కల్లలు. అవి నిజం కావు. కాబట్టి ఉదయం వెలుగులో ఎంత వెతికినా అవి దొరకవు. అయితే మనిషి 'కలలు' మనిషి వ్యక్తిత్వానికి నిదర్శనాలు. ఒక మనిషి స్వప్నం అతని మనో అంతరాలలో నిక్షిప్తమై ఉన్న కోరికలను ప్రతిబింబిస్తుంది. అది అతని వ్యక్తిత్వం. కలలు అర్థమైతే మనిషి అర్థమవుతాడు. అందుకనే ఆ రాత్రి వేళ, ఆ వాతావరణంలో ఆమె స్వప్నం ఆధారంగా ఆమె తనని తాను వెతుక్కుంటోంది. తనని తాను అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తోంది.

మానసిక శాస్త్రం ప్రకారం ఒక వ్యక్తి మరో వ్యక్తిని ప్రేమించటం అంటూ ఉండదు. మరో వ్యక్తిలో తనకు నచ్చినవి వెతుకుతాడు. అంటే ఎదుటి వ్యక్తిని ప్రేమించటం అంటే తనకు నచ్చిన వాటినే, అంటే తనని తానే ప్రేమించటం, పరోక్షంగా. అందుకే ఆమె అతడిని అలా చూసింది. ఏముంది ఈ వ్యక్తిలో ఆకర్షణ? ఎందుకని ఇతడి వైపు మనసు లాగుతోంది? లాంటి ప్రశ్నలు ఆమె మనసులో ఉత్పన్నం అవుతున్నాయి. ప్రతి యువతికి తన పురుషుడి గురించి ఊహలు, ఆలోచనలు ఉంటాయి. అది ఆమె స్వప్నం. అది ఆమె వ్యక్తిత్వం. తన ఎదురుగా ఉన్న యువకుడు తన స్వప్నమా? అని ఆలోచిస్తూ దానిలో తనని తాను వెతుక్కుంటోంది. ఒక వ్యక్తి స్నేహితులను చూపిస్తే అతని వ్యక్తిత్వం

ఊహించవచ్చంటారు. స్నేహితులే అంత ప్రాధాన్యం వహించినప్పుడు జీవిత భాగస్వామి, ప్రేమికుడు వ్యక్తిత్వానికి ఇంకా సరైన నిదర్శనం అవుతాడు. అంటే తన ప్రియుడు తన స్వప్నం, తన వ్యక్తిత్వం. అందుకే ఆమె అతడిని అలా చూడటం. ఆ పై క్లోజప్‌లో ఆలోచనలో ఉన్న ఆమె వదనం చూపటం, అప్పుడు ఆమె ఆలోచిస్తూ, ఒక reflective mood లో ఈ చరణం పాడుతుంది. ఒక సినిమా పాటలో, మామూలు ప్రేమగీతంలో ఇంత తాత్వికత, ఇంత ఆలోచన, ఇంత లోతైన మానవ మనస్తత్వ పరిశీలన, ఇంత సున్నితమైన జీవిత సత్యాన్ని మార్మికంగా పొదిగి ప్రదర్శించటం పరమాద్భుతమైన రచన సంవిధానం. అయితే, పైపైన విన్నా సామాన్యుడికే అర్థమవుతుంది భావం. సముద్రం పైపైన చూస్తే అలలతో అందంగా కనిపిస్తుంది. లోతుల్లోకి వెళ్తే పరమాద్భుతమైన సత్యాలు తెలుస్తాయి. అపురూపమైన అనుభవం లభిస్తుంది. శైలేంద్ర గీతాలు కూడా అంతే. సామాన్యుడూ ఆనందిస్తాడు. అర్థం చేసుకుంటాడు. లోతుగా విశ్లేషించి ఆలోచించేవాడూ పరమానందం అనుభవిస్తాడు. ఈ చరణంలో మరో చమత్కారం ఉంది.

కల ఎప్పటికీ కలనే. అది ఎప్పటికీ నిజం కాదు. కోరికలు వేరు. నిజం వేరు. కాబట్టి ఏ వ్యక్తికీ కలల పురుషుడు, కలల స్త్రీ, లభించటం అంటూ ఉండదు. లభించిన దాని ఆధారంగా నూతన కలను సృజించుకుని సంతోషించటం అసలు వ్యక్తిత్వం. అందుకే 'ఉదయపు వెలుగులలో దొరకని స్వప్నం' అన్నాడు శైలేంద్ర. అంటే, ఎంతగా కల పురుషుడు అనుకున్నా అలాంటి వాడు దొరకడు అని అర్థం. వెలుగు అంటే జ్ఞానం. అంటే, దగ్గరకు వచ్చిన తరువాత అసలు రూపం తెలుస్తుంది. కాబట్టి 'కల కలనే.'

ఈ చరణం తరువాత చరణం ఎంత గొప్పగా ఉన్నా మనసు ఇక్కడే ఆగిపోతుంది.

**ఐసే మెభి క్యా కోయి నహీ భూలేసె జొ హం కో యాద్ కరే'**

'ఈ సమయంలో నన్ను జ్ఞాపకం చేసుకునే వారెవరూ లేరా? అనుకుంటున్నాడు నాయకుడు.

'ఎక్ హల్కీసీ ముస్కాన్ సే సప్నోం క జహాన్ ఆబాద్ కరే' అంటోంది నాయిక. ఒక చిరునవ్వుతో కలల ప్రపంచాన్ని ఆవిష్కరించేవాడు అంటోంది నాయిక

పాట బాణీ ఉద్విగ్నంగా, ఆరంభమే ఉచ్ఛ స్థాయిలో ఆరంభమవుతుంది. పాటంతా సంగీతం ఆ వేగాన్ని, ఉద్విగ్నతను నిలుపుతాయి. సారంగి, గిటార్, వయొలిన్లు అత్యద్భుతమైన రీతిలో పాటను ముందుకు నడుపుతాయి. ముఖ్యంగా గాయనీ గాయకులను వెన్నంటి ఉండి ఈ వాయిద్యాలు పాట ప్రభావాన్ని పెంచుతాయి. మనసుకు ఆనందపు రెక్కల నిచ్చి అనంతంలో విహరింపచేస్తాయి. సాధారణంగా సారంగిని విషాద సంగీతం పలకించేందుకు వాడతారు. రొమాంటిక్ పాటలో విషాద స్వరం ఎందుకంటే శైలేంద్ర పదాల భావాలు ఒక ఆలోచనను, గాంభీర్యాన్ని సంతరించుకుని అంతర్లీనంగా మానవ భావనలలో దాగివున్న విషాదాన్ని ప్రదర్శిస్తాయి... సంగీతం, సాహిత్యం, దృశ్యం ఒకదాన్నొకటి ప్రభావాన్ని పెంచేరీతిలో ఉండటంతో ఒక అల మరో అలకు ఊపునివ్వటం వల్ల ఆకాశానికి ఎగసే అల రూపొందినట్టు

అత్యద్భుతమై, అలౌకిక ఆనందాన్నివ్వగలిగిన అత్యద్భుతమైన కళ సృజన వీలయింది. అందుకే ఇలాంటి సందర్భంలో ఎన్నో యుగళగీతాలున్నప్పటికీ ఈనాటికీ, రాబోయే తరాలెన్నిటికో సజీవంగా ఉండి ఆనందాన్ని, ఆలోచనను ఇవ్వగలిగిన గీతంగా 'యే రాత్ భీగీ భీగీ ' నిలుస్తుంది.

రాత్రంతా మేల్కొని ప్రియుడి కోసం ఎదురు చూస్తు, ప్రేయసి వేదనతో పాడిన పాటలున్నాయి. ప్రేయసి, ప్రియులు రాత్రంతా మేల్కొని నవ్వుతు, తుళ్ళుతూ పాడిన పాటలున్నాయి. యుగళ గీతాలున్నాయి. సోలోలున్నాయి. అయితే, తాత్కాలికంగా రాత్రి మేల్కొని పాడే పాటల చర్చకు ఒక విరామం ఇచ్చి మరిన్ని విభిన్నమైన మధురగీతాల్ చర్చవైపుకు సాగుదాం. మళ్లీ సమయం, సందర్భం, అవకాశాన్ని బట్టి రాత్రిళ్లు మేల్కొని పాడే పాటలవైపు మళ్లుదాం అప్పటివరకూ ఈ రొమాంటిక్ ఫిలాసఫికల్ పాటలను వింటూ మైమరచిపోదాం.

ps: యే రాత్ భీగీ భీగీ పాటలో రెండవ చరణం (లత పాడిన చరణం) ఆధారంగా రెండు నవలలు రాశాను. ఒకటి సత్యం – స్వప్నం, రెండవది స్వప్న వాసంతం.

**(వచ్చే నెల మరిన్ని పాటలతో..)**

Post your comments